క్లుప్తంగా

26న రారవే సమావేశం

రాజాం సిటీ: స్థానిక విద్యానికేతన్ స్కూల్‌లో ఈ నెల 26వ తేదీన రాజాం రచయితల వేదిక(రారవే) 112వ సమావేశం నిర్వహించనున్నామని వేదిక నిర్వాహకులు గార రంగనాథం ఓ ప్రకటనలో శుక్రవారం వెల్లడించారు. ప్రముఖ సాహితీవేత్త పొదిలాపు శ్రీనివాసరావు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశంలో 'శ్రీపాద కథల్లో సామాజిక జీవనం' అనే అంశంపై రాజాపు శాంతారావు ప్రసంగించనున్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి రచయితలు, కవులు, భాషాభిమానులు, సాహిత్యాభిమానులు హాజరుకావాలని ఆయన కోరారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించండి



విద్యార్థులతో మాట్లాడుతున్న అధ్యాపకులు

వంగర: పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ప్రభుత్వ కళాశాలల్లో చేర్పించాలని మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు జి.సత్యనారాయణ, ఎల్.సురేష్‌బాబు పిల్లల తల్లిదండ్రులను కోరుతున్నారు. మండలంలోని మద్దివలస, కె.కొత్తవలస గ్రామాల్లోని పదో తరగతి పాసైన పిల్లల ఇంటింటికీ శుక్రవారం వెళ్లిన వారు.. ప్రభుత్వ కళాశాలల్లో పిల్లలకు అందిస్తున్న విద్య, ఇతర సదుపాయాలను వివరించారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన ఎంతోమంది విద్యార్థులు ఇప్పుడు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారని, ప్రభుత్వ అవకాశాలు కూడా ఎక్కువగా ఉంటాయని తెలిపారు.

ఏకేఎల్ గెడ్డను బాగు చేయండి



వెంకంపేట వద్ద కుచించుకుపోయిన ఏకేఎల్ గెడ్డ

రేగిడి: మండలంలోని ఉనుకూరు–కొత్తచెలికానివలస గ్రామాల మధ్య ఉన్న ఏకేఎల్(ఆకులో వకట్ట) గెడ్డను బాగు చేయాలని రైతులు కోరుతున్నారు. వెయ్యి ఎకరాలకు సాగునీరు అందించే ఈ గెడ్డ ఇప్పుడు పూడికలు, రెల్లి గడ్డితో బాగా నిండిపోయిందని, దీంతో సాగునీటి ప్రవాహం జోరుగా జరగడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వర్షాలు పడకముందే గెడ్డను బాగుచేయాలని, లేకపోతే వర్షాకాలంలో వచ్చే వరదలకు గెడ్డకు గండి కొట్టి పంటలు నీటమునిగిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు.

చిత్రలేఖనంపై శిక్షణ



తాము వేసిన చిత్రాలను చూపిస్తున్న విద్యార్థులు

తెర్లాం: ప్రాథమిక పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులంతా చిత్రలేఖనంలో మెలకువలు నేర్చుకుని, బొమ్మలు బాగా వేయాలని లైబ్రేరియన్ సీహెచ్ కృష్ణమూర్తి తెలిపారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా చిన్నారులకు చిత్రలేఖనంపై శుక్రవారం శిక్షణ ఇచ్చారు. మండలంలోని నెమలాం హైస్కూల్ క్రాఫ్ట్, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు విశ్వేశ్వరరావు విద్యార్థులకు బొమ్మలు వేయడాన్ని నేర్పించారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి



మేకలకు వ్యాధి నిరోధక టీకాలు వేస్తున్న సిబ్బంది

తెర్లాం: పశువులు, గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ జె.నరేంద్రకుమార్ సూచించారు. మండలంలోని కూనాయవలస గ్రామంలో శుక్రవారం చేపట్టిన వ్యాక్సినేషన్‌ను ఆయన పరిశీలించారు. సీజనల్‌గా వచ్చే వ్యాధుల బారిన మూగజీవాలు పడకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని పెంపకందారులకు తెలిపారు. సచివాలయ పశు సంవర్ధకశాఖ సహాయకులు, పశువైద్య కేంద్రాల్లోని సిబ్బంది ప్రతీ గ్రామం వెళ్లి, ఈ టీకాలు వేస్తున్నారన్నారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు

మెరకముడిదాం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న 4,474 మంది విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్న పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు మండలానికి చేరుకుంటున్నాయి. మొదటి విడతగా 8వ తరగతికి చెందిన 577 పాఠ్యపుస్తకాలు వచ్చాయని మండల విద్యాశాఖ సిబ్బంది తెలిపారు.

చెరువు మన్ను.. చేనుకు దన్ను!



నేలసారవంతానికి అవసరమయ్యే పోషకాలు లభించే చెరువు మట్టి

- రసాయన ఎరువుల్లో ఉండే పోషకాలు ఇందులో లభ్యం
- భూసారంతో పాటు అధిక దిగుబడులకు ఆస్కారం
- ప్రస్తుతం పొలాల్లో చెరువు మట్టి వేసుకుంటే మంచిది
- రైతులు అప్రమత్తం కావాలని అధికారుల సూచన

రాజాం సిటీ:

పంటభూముల్లో సేంద్రియ పదార్థం తక్కువగా ఉండడం, వర్షపునీటిని నిలుపుకునే సామర్థ్యం తగ్గుతుండడంతో రైతులకు సరైన దిగుబడులు రావడం లేదు. మారిన వాతావరణ పరిస్థితుల కారణంగా రసాయన ఎరువులు విపరీతంగా వేయడం ద్వారా భూములు పనికిరాకుండా పోతున్నాయి. ఈ నేపథ్యంలో రైతులు చెరువు మట్టిని విరివిగా వాడుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. ప్రస్తుతం వేసవి కావడంతో చెరువుల్లో నీరు అడుగంటిపోతుందని, ఈ క్రమంలో చెరువుల్లోని మట్టిని సేకరించడం సులభమని చెబుతున్నారు. చెరువు మట్టిని ఎరువుగా పొలాల్లో వేసుకుంటే రసాయన ఎరువులకు అయ్యే ఖర్చు తగ్గించుకోవచ్చని అంటున్నారు.

• 2 నుంచి 3 అడుగులు..

జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఉన్న వర్షాధారిత చెరువులు ప్రస్తుతం వేసవి ఎండల తీవ్రతకు అడుగంటిపోతున్నాయి. ఎండిన చెరువుల్లోని 2 నుంచి 3 అడుగుల మేర పేరుకుపోయిన మట్టిని పంట భూముల్లో వేసుకోవాలి. భూసార పరీక్షలు చేయించుకుని వాడుకుంటే ఇంకా మంచిది. ప్రస్తుతం భూములు ఖాళీగా ఉండడంతో ఎకరానికి సరిపడ మట్టిని ట్రాక్టర్లతో తరలించి, వేసుకునేందుకు ఈ నెల అనుకూలం. రైతులు జేసీబీలు, ట్రాక్టర్లతో తక్కువ ఖర్చుతో మట్టిని తరలించుకునే అవకాశం ఉంటుంది. తర్వాత ఎంబీ నాగలితో పాటు రోటోవేటర్‌తో కలియదున్నితే భూమిలో అప్పటికే ఉన్న మట్టితో ఇది కలిసిపోయి పంట సాగుకు అనుకూలంగా మారుతుంది.

• ఒండ్రు, బంకమట్టితో మేలు..

వర్షాలు బాగా కురిసినప్పుడు ఎత్తైన ప్రదేశాల నుంచి వర్షపు నీటితో పాటు ఇసుక, బంకమట్టి, ఒండ్రు మట్టి, కుళ్లిన వ్యర్థాలతో కలిసి చెరువులోకి చేరుతాయి. అందులో నీరు ఉన్నంతకాలం లోపలే కుళ్లి మంచి సేంద్రియ కర్బనంగా మారుతుంది. సాధారణంగా చెరువు మట్టిలో 70 శాతం ఒండ్రు, 30 శాతం బంకమట్టి ఉంటుంది. పంటలకు అవసరమయ్యే నత్రజని, భాస్వరం, పొటాష్‌లతో పాటు సూక్ష్మపోషకాలు కూడా ఉంటాయి. చెరువు మట్టితో పంట భూమిలో నీటి నిల్వ సామర్థ్యం, ఆయకట్టు విస్తీర్ణం పెరిగి, అధిక దిగుబడులు సాధించవచ్చు.

నేలకు పోషకాలు లభిస్తాయి..



చెరువు మట్టిలో రసాయన ఎరువుల్లో ఉండే పోషకాలన్నీ సమృద్ధిగా లభిస్తాయి. అవకాశం ఉన్నంత వరకు చెరువు మట్టిని రైతులు పంటపొలాలకు వినియోగించడం మంచిది. ఈ నెలలోనే మట్టి వేసుకునేందుకు అనుకూలంగా ఉంటుంది. పూర్వం కూడా రసాయన ఎరువులకు బదులు ఎక్కువగా చెరువు మట్టినే వినియోగించేవారు. ప్రస్తుతం చెరువులు అడుగంటడడంతో మట్టి సేకరణ, తరలించడం సులభం.

– ఎం.రేణుకాసాయి, వ్యవసాయాధికారి, రాజాం.

విలువైన సేంద్రియ కర్బన పదార్థం అందివ్వడం వల్ల మొక్కలు నీటి ఎద్దడిని కూడా తట్టుకుని అధిక దిగుబడులు ఇస్తాయని రాజాం వ్యవసాయాధికారి ఎం.రేణుకాసాయి తెలిపారు. చెరువు మట్టి వేసిన పొలాల్లో మొక్కజొన్న, పత్తి పంటలు పండిస్తే దిగుబడులు ఆశించిన మేర లభిస్తాయన్న విషయం పరిశోధనలో వెల్లడైనట్లు ఆమె వివరించారు.

రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యం



మాట్లాడుతున్న ఏవో వెంకటయ్య

రామభద్రపురం: రైతు శ్రేయస్సే ప్రభుత్వ లక్ష్యమని ఏవో వెంకటయ్య అన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో వీఏఏ, వీహెచ్‌ఏలతో శుక్రవారం సమావేశమైన ఆయన.. ఖరీఫ్ సీజన్‌లో వ్యవసాయ శాఖ చేపట్టాల్సిన ప్రణాళికలు, అనుసరించాల్సిన వ్యూహాలు, రైతులను చైతన్యం చేయాల్సిన తీరుపై దిశానిర్దేశం చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ మండలంలోని రైతులకు అవసరమైన 750 క్వింటాళ్ల వరి విత్తనాలు సిద్ధం చేస్తున్నామన్నారు.

ఎంటీయూ 1121, ఎంటీయూ 1064, సోనామసూరి, సాంబమసూరి, ఆర్జేఎల్ విత్తనాలతో పాటు ఎంటీయూ 1224, ఎంటీయూ 1518 కొత్త రకం వరి విత్తనాలు తెప్పిస్తున్నామన్నారు. మరో రెండు రోజుల్లో అవన్నీ రానున్నయన్నారు. ఇప్పటికే రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు సిద్ధంగా ఉన్నాయని, ఆర్బీకేల్లో 150 మెట్రిక్ టన్నులు, మన గ్రోమోర్‌లో 450 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు ఉన్నాయన్నారు. మరో 60 మెట్రిక్ టన్నులు రానుందన్నారు. అలాగే 60.8 క్వింటాళ్ల కట్టెజనుము, పిల్లిపెసర, జీలుగ వంటి పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ఏడాది వర్షపాతం నమోదు ఎక్కువగా ఉంటుందని వాతావరణ శాఖ తెలిపిందని, సాగునీటి కోసం రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ప్రవేటు వ్యాపారులు నిషేధిత ఎరువులు, విత్తనాలు విక్రయించినట్లు ఫిరాదులు వస్తే వారి దుకాణాల అనుమతులు రద్దు చేస్తామని హెచ్చరించారు. రైతులంతా ఖరీఫ్ సాగుకు పొలాలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



హెల్మెట్ ధరించడం వల్ల కలిగే రక్షణ గురించి తెలియజేస్తున్న ఎస్ఐ శ్రీనివాసరావు

రేగిడి: ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ఎస్ఐ ఇ.శ్రీనివాసరావు సూచించారు. మండలంలోని మజ్జిరాముడుపేట గ్రామ కూడలి వద్ద సిబ్బందితో కలిసి శుక్రవారం వాహన తనిఖీలు చేపట్టిన ఆయన.. వాహనదారుల డ్రైవింగ్ లైసెన్స్, ఆర్సీ, సీబుక్‌లు పరిశీలించారు. అనంతరం రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీటుబెల్టు పెట్టుకోవాలని తెలిపారు. పరిమితికి మించి ప్రయాణికులను వాహనాల్లోకి ఎక్కించవద్దని, ద్విచక్ర వాహనంపై ఇద్దరు కంటే ఎక్కువ మంది వెళ్లకూడదని తెలిపారు. మద్యం తాగి, సెల్‌ఫోన్ మాట్లాడుతూ వాహనాలు నడపవద్దన్నారు.

శిథిలావస్థకు చేరిన రెగ్యులేటర్లు



ప్రమాదకరంగా కనిపిస్తున్న రెగ్యులేటర్లు

రేగిడి: మండలంలోని సంకిలి గ్రామం వద్ద ఉన్న సాయన్న చానల్ ప్రధాన కాలువ రెగ్యులేటర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. రెగ్యులేటర్లు పాడవ్వడంతో కాలువ ద్వారా సాగునీటి ప్రవాహం సక్రమంగా జరగడం లేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి, చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

విత్తనశుద్ధిపై అవగాహన



బీజామృతంతో విత్తనశుద్ధిపై అవగాహన కల్పిస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

రేగిడి: మండలంలోని గుల్లపాడు గ్రామంలో విత్తనశుద్ధిపై రైతులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయం ఎల్2 అధికారి గౌరీశ్వరరావు మాట్లాడుతూ విత్తనాలు పొలాల్లో వేసే ముందు వాటిని శుద్ధి చేసుకోవడం చాలా మంచిదన్నారు. బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసి, పొలంలో వేసుకుంటే పంటకు చీడపీడలు పట్టవని, మంచి దిగుబడులు వస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీలు పి.తవిటినాయుడు, రమణ తదితరులు పాల్గొన్నారు.

నవధాన్యాల సాగుతో నేల సారవంతం

రాజాం: నవధాన్యాల సాగుతో నేల సారవంతమవుతుందని, అలాగే పంట దిగుబడులు అధికంగా వస్తాయని ప్రకృతి వ్యవసాయం అధికారిణి రమాదేవి అన్నారు. మండలంలోని పొగిరి గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పథకం పనుల వద్ద నవధాన్యాల సాగుపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఖరీఫ్ సాగుకు ముందు పొలాల్లో నవధాన్యాలు వేసుకుని, అవి మొక్కలు అయిన తర్వాత వాటిని పొలంలోనే కలియదున్నాలని, ఇలా చేయడం ద్వారా పంటకు కావాల్సిన పోషకాలు నేల ద్వారా అందుతాయన్నారు. దీంతో ఆ తర్వాత వేసే ప్రధాన పంట ఆరోగ్యవంతంగా ఉండడంతో పాటు అధిక దిగుబడులను ఇస్తుందన్నారు. అనంతరం మొక్కజొన్న పంటలో కాయతొలుచు కత్తెర పురుగు నివారణకు అగ్నిఅస్త్రం తయారీ, వినియోగాన్ని వివరించారు.

పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ



పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్న ఆర్బీకే సిబ్బంది

రాజాం సిటీ: పచ్చిరొట్ట సాగుతో నేల సారవంతం అవుతుందని, అలాగే పంట దిగుబడులు అధికంగా వస్తాయని ఏవో ఎం.రేణుకాసాయి అన్నారు. మండలంలోని కంచరాం రైతు భరోసా కేంద్రంలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండలానికి 31 క్వింటాళ్ల జీలుగ, కట్టెజనుము వంటి పచ్చిరొట్ట విత్తనాలు వచ్చాయని, వీటిని ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతులకు 50 శాతం రాయితీతో అందజేస్తున్నామని తెలిపారు.

178 మందికి వైద్యసేవలు

జామి: మండల కేంద్రంలోని సచివాలయం–3 పరిధిలో శుక్రవారం ఆరోగ్య సురక్ష శిబిరం నిర్వహించారు. జామి పీహెచ్‌సీ వైద్యాధికారి నాగశ్వేత ఆధ్వర్యంలో వైద్యులు బి.మహేష్, నాగమణి 178 మందికి వైద్య సేవలందించారు. మందులు అవసరమైన వారికి ఉచితంగా పంపిణీ చేశారు. వేసవి ఎండల దృష్ట్యా వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య సహాయకులు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడుతూ.. పాడుతూ..!

రాజాం: పట్టణంలోని బాలభవన్‌లో జరుగుతున్న వేసవి శిక్షణా తరగతుల్లో చిన్నారులు ఆడుతూ పాడుతూ వివిధ కళలను చాలా ఆసక్తిగా నేర్చుకుంటున్నారు. రాష్ట్ర విద్యాశాఖ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ తరగతులకు 250 మంది వరకు హాజరవుతుండగా, వారికి నృత్యం, గానం, చిత్రలేఖనం, క్రాఫ్ట్ వంటి అంశాలను నేర్పిస్తున్నామని ప్రోగ్రాం డైరెక్టర్ సుంకరి రమేష్ తెలిపారు.



నృత్యం నేర్చుకుంటున్న చిన్నారులు



శిక్షణలో పాటలు పాడటం నేర్చుకుంటున్న విద్యార్థులు

విజయం మనదే..



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంబంగి

- ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: సార్వత్రిక ఎన్నికల్లో విజయం మనదేనని వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు ధీమా వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. టీడీపీ నాయకులు ఎంతగా ప్రచారం చేసుకున్నా జూన్ 4వ తేదీన వెల్లడయ్యే ఎన్నికల ఫలితాల్లో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని, వైఎస్సార్ సీపీ మరోసారి అధికారంలోకి వస్తుందని జోష్యం చెప్పారు. బొబ్బిలి నియోజకవర్గంలో కూడా తాను ఎమ్మెల్యేగా మరోసారి గెలుస్తానన్నారు. 2019 ఎన్నికల్లో కూడా టీడీపీ నాయకులు విజయం వారిదేనన్న రీతిలో బాగా ప్రచారం చేసుకున్నారని, చివరికి 151 అసెంబ్లీ స్థానాలను వైఎస్సార్ సీపీ గెలుచుకుని, రికార్డు సృష్టించిందని గుర్తు చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో ప్రజలు సుఖసంతోషాలతో గడిపారని, మళ్లీ అదే పాలనను కోరుకునే దిశగా ప్రజలు ఫ్యాన్‌కు ఓటు వేశారన్నారు. ప్రజల తీర్పు వైఎస్సార్ సీపీ వైపే ఉందని, గతంలో సాధించిన సీట్లు కన్నా ఎక్కువ సీట్లు సాధిస్తామన్న నమ్మకం తమకు ఉందన్నారు. టీడీపీ మౌత్ పబ్లిసిటీ చూసి ఏమాత్రం ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. జూన్ 4వ తేదీన సంబరాలకు సిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ చింతల సింహాచలంనాయుడు, పాలసొసైటీ అధ్యక్షుడు చొక్కాపు రామకృష్ణ, పీఏసీఎస్ అధ్యక్షుడు కిర్ల చంద్రశేఖర్, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయులు, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు పత్తిగుళ్ల ఏక్‌నాథ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు దర్రు పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ విజయం ఖాయం..

బొబ్బిలి: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ సీపీ బొబ్బిలి ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు శుక్రవారం మీడియాతో మాట్లాడారు. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిష్పక్షపాత పాలనకు ప్రజలు ఓటు రూపంలో మరోసారి జై.. కొట్టారన్నారు. ఓడిపోతామన్న భయంతోనే టీడీపీ గెలుస్తామని ప్రచారం చేసుకుంటోందని, జూన్ 4న వెల్లడయ్యే ఫలితాల్లో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమని, మళ్లీ వైఎస్సార్ సీపీదే అధికారమని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్‌నాయుడు, ఏఎంసీ వైస్ చైర్‌పర్సన్ తెంటు పార్వతి, పార్టీ నాయకులు దమ్మా అప్పచ్చి, చోడిగంజి రాజగోపాలరావు, బమిడిపాటి విశ్వనాథ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తలే రాజేష్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి తలే రాజేష్

రాజాం: పట్టణంలో వైఎస్సార్ సీపీ రాజాం ఎమ్మెల్యే అభ్యర్థి, డాక్టర్ తలే రాజేష్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి చేరుకుని, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అలాగే కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచిపెట్టారు. అనంతరం సన్‌రైజ్ ఆస్పత్రిలోని రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ తలే రాజేష్ సతీమణి డాక్టర్ మాధవీలత, పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, జెడ్పీటీసీ బండి నర్సింహులు, వంగర ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, రేగిడి వైస్ ఎంపీపీలు టంకాల అచ్చెన్నాయుడు, వావిలపల్లి జగన్మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపు సర్వే



సర్వే చేస్తున్న సహిత విద్య ఉపాధ్యాయుడు



తెర్లాం అంగన్‌వాడీ కేంద్రంలో దివ్యాంగ పిల్లల వివరాలు సేకరిస్తున్న ఎంఈవో త్రినాధరావు

బొబ్బిలి: మండలంలోని కారాడ గ్రామంలో ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపు సర్వే శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా సహిత విద్య ఉపాధ్యాయులు పి.కృష్ణమోహనరావు, జి.రవి కలిసి దివ్యాంగులైన పిల్లల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరించారు. పిల్లలకు వర్తించే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను, అందజేస్తున్న ఉపకరణాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఇప్పటివరకు 14 మంది ప్రత్యేకావసరాలు కలిగిన పిల్లలను గుర్తించి, కారాడ ప్రభుత్వ పాఠశాలలో చేర్పించామన్నారు.

తెర్లాం: మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐదేళ్లు దాటిన దివ్యాంగ పిల్లల వివరాలను అందజేయాలని ఎంఈవో జె.త్రినాధరావు సూచించారు. ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపు సర్వేలో భాగంగా మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం సందర్శించిన ఆయన.. ప్రీస్కూళ్లలో దివ్యాంగ పిల్లలు ఉన్నారా, లేదా అని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ దివ్యాంగ పిల్లలకు ఈ విద్యా సంవత్సరంలో ఒకటో తరగతి నుంచే ఐఈఆర్‌టీల ద్వారా ప్రత్యేక బోధన ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ఆయన వెంట ఐఈఆర్‌టీ సూర్యారావు తదితరులు ఉన్నారు.



చిత్రలేఖనంపై చిన్నారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం



కాగితాలతో తయారు చేసిన బకెట్లను చూపిస్తున్న చిన్నారులు